# కాణిపాక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబర్ 6 : కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శనివారం నుంచి 21 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను, పుష్కరిణిని ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలు, వివిధ దేవతామూర్తుల లైటింగ్ ఆర్చిలతో కాణిపాక క్షేత్రం వెలుగులీనుతోంది. అన్ని ఆలయాలను వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రధాన ఆలయంలో పందిరి ఏర్పాటు కోసం తొలిగుంజకు పూజలు చేసి అధికారులు నాటారు. లడ్డూ రుచి విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు పోటులో లడ్డూల నాణ్యతను ఈవో పరిశీలించారు. లడ్డూ విక్రయ కేంద్రాలు, పడితరం స్టోర్స్, అన్నదాన సత్రం, కల్యాణకట్టను తనిఖీ చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



# ఊరూవాడా చవితి సందడి

వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. మండపాల నిర్మాణంతో పాటు, వినాయక విగ్రహాల తరలింపులో శుక్రవారం యువత నిమగ్నమైతే, పెద్దలంతా పండుగకు కావాల్సిన సంబారాలను సమకూర్చుకోవడంలో మునిగితేలారు.పట్టణాల్లో ఏ రోడ్డు చూసినా రెండువైపులా వినాయక ప్రతిమలతో, పూజా వస్తువులతో నిండిపోయాయి. తోపుడు బళ్లమీదా, ఫుట్‌ఫాత్‌లపై వెలగ, జామ, యాపిల్, కమలా, సీతాఫలం, అరటి వంటి పండ్ల దుకాణాలు వెలిశాయి. కాగితపు గొడుగులు, అరటి పిలకలు, ఇతర పూజా ద్రవ్యాల కొనుగోళ్లు కూడా బాగా సాగాయి.మరోవైపు వాడవాడలా వినాయక మండపాలను ఉత్సవాల కోసం సిద్ధం చేశారు. ముసుగులు వేసిన భారీ వినాయక విగ్రహాలు ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా ఆయా మండపాలకు తరలాయి. మండపాల వద్ద విద్యుత్తు, బారికేడ్లు ఇతర ఏర్పాట్ల హడావిడిలో యువత మునిగితేలింది.

## తిరుపతి ఆర్టీవోగా మురళీమోహన్

తిరుపతి(రవాణా), సెప్టెంబరు 6 : తిరుపతి,గూడూరు ఆర్టీవోలుగా కె.మురళీ మోహన్, డీఎస్.కృష్ణకిశోర్ నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా రవాణా శాఖలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న వీరికి ఆర్టీవోలుగా పదోన్నతి కల్పించి, బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

## కోతులను తరిమే మంకీ గన్

పంట పొలాలు..ఇళ్ల వద్ద కోతుల బెడద ఉందా?అలాంటి వారి కోసం ఈ మంకీ గన్‌ను చిత్తూరు జిల్లా పలమనేరులో రూ.150 చొప్పున అమ్ముతున్నారు. మహారాష్ట్రలోని జులేగావ్‌కు చెందిన సాగర్ అనే యువకుడు వీటిని విక్రయిస్తున్నాడు. ఈ గన్ పేల్చడం వల్ల వచ్చే శబ్దానికి కోతులు పరుగులు పెడుతున్నాయి. ఈ మంకీ గన్‌కు గ్యాస్ వెల్డింగ్ షాపుల్లో వినియోగించే కార్బయిడ్ రాయిని వాడాలి. అడుగు పొడవున్న 3 అంగుళాల పైపుతో ఈ గన్‌ను తయారు చేశారు. వెనుక వైపు గ్యాస్ లైటర్ ఏర్పాటు చేసివుంది. పైపు మధ్యలో ఒక రంధ్రంలోకి కార్బయిడ్ రాయి వేసి.. దానిపై నీటి చుక్కలు వేసి ఆ రంధ్రాన్ని పైపుకు ఏర్పాటు చేసిన మరో పైపుతో మూసి వేయాలి. కోతులున్న వైపు గన్ పెట్టి.. పైపు వెనుక వైపు ఏర్పాటుచేసిన గ్యాస్ లైటర్‌ను నొక్కగానే పెద్ద శబ్దం రావడంతో పాటు పైపు ముందు భాగంనుంచి తపాకీ నుంచి వచ్చే ఫైర్ కనిపిస్తుంది. ఈ శబ్దానికి చెట్లపై నుంచి కోతులు దూకి పరుగులు తీస్తాయి.



- పలమనేరు


విశ్వరూప గణేశుడు
కేన్వాసుపై కలంకారీ చిత్రం
- లక్ష్మీవాసు ఐత్తల


ఉచ్ఛిష్ట గణపతి
- కె.మహేశ్వర్


స్టిల్ లైఫ్
- బి.కిరణ్‌కుమారి


## విభిన్న రూపాయ...

దేవుడు ఒక్కరే కానీ, భక్తుల ఊహాశక్తిని బట్టీ రూపాలు అనంతం. అందులోనూ చవితి వంది ళ్లలో బొజ్జ గణపయ్య విభిన్న రూపాల్లో ప్రత్యక్షమవుతుంటాడు. హిందూ దేవుళ్లలో ఇంత వింత రూపాలుగలవారు మరొకరు లేరు. పిళ్లారిస్వామి అంటే చిత్రకారులకు మరీ మమకారం. కలాలూ, కుంచెలూ, రంగులూ విన్యాసాలు చేస్తాయి. కేన్వాసు మీద సంపూర్ణ స్వేచ్ఛతో విహరిస్తాయి. ఇవి తిరుపతికి చెందిన కొందరు చిత్రకారులు చిత్రించిన ఆ మహానాయకుడి మనోరూపాలు. వినాయక చవితి సందర్భంగా ఆంధ్రజ్యోతికి వీరు ప్రత్యేకంగా అందించారు. - తిరుపతి


విష్వక్సేనమూర్తి
కలంకారీ చిత్రం - పి.రమేష్


భక్త గణపతి
- ఎ.రామచంద్రయ్య


గాంధర్వ గణపతి
- జి.వెంకటేశ్వర్లు(సాగర్ గిన్నె)


లడ్డూ ప్రియుడు
- ఎస్. లావణ్య



# తిరుమలలో 'తిరునామం' ప్రారంభం

[ ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ ]

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు నుదుట తిరునామం దిద్దే కార్యక్రమాన్ని టీటీడీ పునఃప్రారంభించింది. హిందూ సంప్రదాయానికి అద్దంపట్టేలా, భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించేలా కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈకార్యక్రమం పూర్తిగా కనిపించకుండా పోయింది. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులందరూ తిలకధారణ చేసుకుని శ్రీవారిని దర్శించుకోవాలనే లక్ష్యంతో 2017లో అప్పటి అధికారులు నిర్ణయం తీసుకుని ప్రత్యేకంగా తయారు చేయించిన అచ్చులతో శ్రీవారిసేవకుల ద్వారా మూడునామాలు, ఏకనామం పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వంలో ఈవిధానం కనిపించకుండా పోయింది. ఈక్రమంలో గత నెల 28వ తేదీన 'తిరునామం అమలేది తిరుమలేశా?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన టీటీడీ ఉన్నతాధికారులు తిరునామం దిద్దే కార్యక్రమాన్ని పునః ప్రారంభించాలని నిర్ణయించారు. తిరుమలలోని ఏటీసీ సర్కిల్ వద్ద శుక్రవారం సాయంత్రం ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, భక్తులకు శ్రీవారి సేవకులు తిలకధారణ చేశారు. ఈవో మాట్లాడుతూ.. తిలకధారణ కార్యక్రమాన్ని పునః ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఏటీసీ, సుపథం, వరాహస్వామి ఆలయం, కల్యాణకట్ట, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు 1,2 వద్ద శ్రీవారి సేవకులు నిరంతరాయంగా తిలకధారణ చేస్తారని చెప్పారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీపీఆర్వో రవి, పీఆర్వో నీలిమ తదితరులు పాల్గొన్నారు.


శ్యామలరావుకు తిరునామం పెడుతున్న శ్రీవారి సేవకురాలు

## టీటీడీ సమాచార కేంద్రాలకు, ఆలయాలకు
# 75వేల లడ్డూలు పంపాం

టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూలకు సంబంధించి దళారులను అరికట్టాలనే ఉద్దేశంతో గతనెల 29వ తేదీ నుంచి దర్శనం చేసుకోని వారికి ఆధార్‌కార్డుపై రెండు లడ్డూలు మాత్రమే ఇచ్చే విధానాన్ని ప్రారంభించామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దర్శనం చేసుకున్న భక్తులకు స్టాక్ లభ్యతను బట్టి రూ.50 చొప్పున కోరినన్ని లడ్డూలు అందిస్తున్నామన్నారు. చాలాకాలంగా బయట ప్రాంతాల్లో ఉన్న టీటీడీ ఆలయాలు, చెన్నై, బెంగళూరు, వేల్లూరులోని టీటీడీ సమాచార కేంద్రాల్లో లడ్డూల డిమాండ్ ఉన్నప్పటికీ పంపలేకపోయామన్నారు. లడ్డూల జారీ విధానంలో నూతన మార్పుల కారణంగా నాలుగు రోజుల్లో దాదాపు 75 వేల లడ్డూలు ఆయా ప్రాంతాలకు పంపామన్నారు. దీన్ని శాశ్వత ప్రాతిపదికన అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయా ఆలయాల్లో ఇందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుకు 3.5 లక్షల లడ్డూలను తయారు చేస్తున్నామని, లడ్డూల తయారీని పెంచేందుకు అవకాశముందన్నారు. ఆవు నెయ్యి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు లడ్డూ ప్రసాదం నాణ్యతను పెంచేందుకు ప్రస్తుతమున్న టెండర్ షరతులను అనుసరించి నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేస్తున్నామన్నారు. గతంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టామన్నారు. ముఖ్యంగా నెయ్యి నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు.. టీటీడీకి ఒక గ్యాస్ క్రోమాటోగ్రాఫ్, హెచ్‌పీఎల్‌సీని విరాళంగా అందిస్తామని తెలిపాయన్నారు. దీని ధర సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందన్నారు. వీటిని ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరుస్తారని వెల్లడించారు. అన్నప్రసాద విభాగాన్ని ఆధునీకరించడంతోపాటు అన్నప్రసాదాల పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు త్వరలో బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన నిపుణులు తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్నప్రసాద కేంద్రాలను సందర్శిస్తారన్నారు. వీరి సూచనలతో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అన్నప్రసాద విభాగాన్ని శాశ్వతంగా సంపూర్ణస్థాయిలో ఆధునీకరిస్తామన్నారు. ప్రసాదాల్లో వినియోగించే జీడిపప్పు నాణ్యతపై కూడా దృష్టిసారించామన్నారు.

## వృథా అవుతున్న సాంబారు, రసం

- తిరుమలలోనూ డయాలసిస్ సౌకర్యం కల్పించండి
- డయల్‌యువర్ టీటీడీ ఈవోలో భక్తులు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాద భవనంలో సిబ్బంది భక్తులకు వడ్డించేటప్పుడు సాంబారు, రసం ఎక్కువగా పోసి వృథా చేస్తున్నారని నారాయణరాజు (కార్వేటినగరం), ఆన్‌లైన్ రేడియో ద్వారా ఉదయం, సాయంత్రం భక్తిపాటలు ప్రసారం చేయాలని మాలతి(హైదరాబాద్), భక్తులకు నాణ్యమైన కూరగాయలతో భోజనం పెట్టాలని రాఘవేంద్ర(వేలూరు) డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో శ్యామలరావు దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఈవో స్పందిస్తూ వృథా కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పాటల ప్రసారం, కూరగాయలపై పరిశీలిస్తామన్నారు. భాస్కర్(కడప) మాట్లాడుతూ.. లడ్డూలో నాణ్యత పెరిగిందని ప్రశంసించారు. మాడవీధుల్లో భక్తులు చెప్పులు లేకుండా నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నప్రసాద భవనంలో శ్రీవారిసేవకులకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, రూ.300 దర్శన టికెట్ రద్దు చేసుకుంటే డబ్బులు రీఫండ్ చేయాలని కోరారు. ఈవో బదులిస్తూ.. చెప్పులు లేకుండా భక్తులను అనుతించేలా భద్రతా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారన్నారు. దివ్యాంగులకు అన్నప్రసాదాలను ప్రత్యేకంగా వడ్డిస్తామన్నారు. ఆన్‌లైన్ లక్కీడిప్‌లో సుప్రభాతం, తోమాల, అర్చన ఒక్కొక్కరికి కాకుండా, ఇద్దరికీ కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, ఆలయంలోని క్యూలైన్లలో ఫ్యాన్లు, లైట్లు పనిచేయడం లేదని భావనారాయణ(గుంటూరు) తెలిపారు. చాలామంది సేవలకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఇద్దరికి డిప్‌లో సేవలు కేటాయించడం సాధ్యం కాదని, క్యూలైన్లో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. పరకామణిసేవ తరహాలోనే లడ్డూ ప్రసాదసేవను కూడా ప్రవేశపెట్టాలని ప్రదీప్‌కుమార్ (హైదరాబాద్) కోరగా, టీటీడీ బోర్డు నిర్ణయం మేరకు ఈ సేవను రద్దు చేశామని తెలిపారు. ఆన్‌లైన్‌లో గదులు పొందిన వారికి కాలినడక మార్గాల్లో స్కానింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని రమేష్‌బాబు(వైజాగ్) కోరగా, పరిశీలిస్తామన్నారు. అంగప్రదక్షిణ టోకెన్లు పొందిన చాలామంది సేవకు రావడం లేదని, ఈక్రమంలో ఆఫ్‌లైన్‌లో కూడా ఇవ్వాలని ప్రవీణ్(కుప్పం) కోరారు. ఈ టోకెన్లను ఆఫ్‌లైన్‌లో ఇవ్వలేమని బదులిచ్చారు. తిరుమలలో డయాలసిస్ సౌకర్యం కల్పించాలని వెంకటేష్ (హైదరాబాద్)కోరగా.. ఈవో పరిశీలిస్తామన్నారు.

## రౌడీయిజాన్ని సహించేది లేదు : డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6: ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో రౌడీయిజాన్ని సహించేది లేదని డీఎస్పీ వెంకటనారాయణ హెచ్చరించారు. పశ్చిమ పోలీసు స్టేషన్ పరిధి లోని పరసాల వీధిలో రెండ్రోజుల కిందట జరిగిన గొడవల్లో ఇద్దరు రౌడీషీటర్లను అరెస్టు చేసి, జైలుకు పంపడం జరిగిందన్నారు. ఇందులో రాజకీయ కోణాలు లేవన్నారు. ఎంతటి వారైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తామని చెప్పారు.



తుషార్ కపూర్

## తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో బాలీవుడ్ నటుడు తుషార్ కపూర్, భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా, దర్శనం అనంతరం రామచంద్రయాదవ్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఇబ్బందులన్నీ తొలగిపోవాలని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు.

## రైలు ఢీకొని ఒకరి మృతి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6: తిరుపతి-తిరుచానూరు పరిధిలోని రైలు పట్టాలపై రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఏఎ్సఐ వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. రైలు ఇంజన్ షంటింగ్ చేస్తుండగా టీషర్ట్ ధరించి ఉన్న దాదాపు 45 ఏళ్ల వయసున్న వ్యక్తి పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి చెందాడు. వ్యక్తిగత వివరాలేమీ లభ్యం కాలేదు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. ఆచూకీ తెలిసినవారు 934780 7007 నెంబరును సంప్రదించాలని కోరారు.

# సమస్యల పరిష్కారమేదీ?

## అధికారుల తీరుపై జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యేల ఆగ్రహం





జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసులు, హాజరైన సభ్యులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 6: 'ఎప్పుడు మీటింగ్ పెట్టినా అధికారులు వస్తున్నారు. మేం చెప్పే సమస్యల్ని నోట్ చేసుకుంటున్నారు. పరిష్కారం మాత్రం చేయడం లేదు. రెండు నెలల కిందట జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేం ప్రస్తావించిన ఏ సమస్య కూడా పరిష్కారం కాలేదు' అంటూ ఆయా శాఖల జిల్లా అధికారులను ఎమ్మెల్యేలు నిలదీశారు. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష ప్రజాప్రతినిధులూ హాజరయ్యారు. సమస్యలపై అధికారులను నిలదీశారు. జడ్పీ సమావేశాల్లో ఆయా అంశాలు, శాఖల గురించి ఎంత చర్చించినా ఫలితం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం పది అంశాలపై చర్చ జరగాల్సి ఉండగా.. ఒక్కో అంశం గురించే సుదీర్ఘ చర్చ జరగడంతో ఐదింటితో సమావేశాన్ని ముగించారు. దాదాపు ప్రతి ఒక్కరూ ఆయా సమస్యల గురించి సమావేశంలో చర్చించారు. కొందరు జడ్పీటీసీలు కూడా మాట్లాడారు. వీరు చెప్పిన సమస్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్ నోట్ చేసుకుంటూ పరిష్కార మార్గాలు చెప్పారు. ఈ సమావేశానికి తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు భరత్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రగిరి, జీడీనెల్లూరు, తిరుపతి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, థామస్, ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్, జడ్పీటీసీలు, జేసీ విద్యాధరి, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తిరుపతి డీఆర్వో పెంచల కిశోర్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, సీఈవో గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

### 'ఇసుక' దుమారం

కర్ణాటక సరిహద్దులోని రామసముద్రం మండలంలో ఇసుక రీచ్ లేదని, ప్రజలు ఇళ్లు ఎలా నిర్మించుకోవాలని జడ్పీటీసీ రామచంద్రారెడ్డి నిలదీశారు. పక్క మండలాల నుంచి తెచ్చుకుంటుంటే పోలీసులు పట్టుకొని కేసులు పెడుతున్నారన్నారు. ఉచిత ఇసుక విధానమంటే ఇదేనా అని ప్రశ్నించారు. దీనిపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కలగజేసుకొని ఇసుక కొరత ఉందని చెప్పండి కానీ.. ఉచిత ఇసుక విధానాన్ని మాత్రం ప్రశ్నించవద్దని సూచించారు. నదుల్లో ఇసుక లేకుండా వైసీపీ నాయకులు లూటీ చేస్తే ఎక్కడి నుంచి ఉంటుందని ఆయన ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ కలగజేసుకొని.. నదులు, వంకల్లో ఇసుక లేదని, మరోసారి వరదలు వస్తే తప్ప లభ్యం కాదన్నారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నారని జడ్పీటీసీ అడిగిన ప్రశ్నకు 'ఫలానా చోట ఇసుక అక్రమ రవాణా చేస్తున్నార'ని తనకే పదుల సంఖ్యలో ఫోన్లు వస్తున్నాయని కలెక్టర్ సమాధానం చెప్పారు. ఎక్కడైనా మనుషుల ద్వారా మాత్రమే ఇసుక తవ్వుకోవచ్చని చెప్పారు.

### ప్రాణాలు పోతున్నాయ్: థామస్

'గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎలాంటి హెల్త్‌కేర్ సౌకర్యం లేదు. చిన్న రోడ్డు ప్రమాదం జరిగినా చిత్తూరు, చీలాపల్లి సీఎంసీకి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈలోపు ప్రాణాలు పోతున్నాయి. ఇక, జనరల్ ఫిజీషియన్, జనరల్ మెడిసిన్ చేసిన వైద్యులు అందించాల్సిన వైద్యాన్ని పెనుమూరు సీహెచ్‌సీలో కళ్లు, పళ్ల డాక్టర్లు చేస్తుండడం దారుణం. పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల్లో పాము కరిస్తే వైద్యం కోసం కొన్ని కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది' అంటూ వైద్య సమస్యను కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే థామస్ తీసుకెళ్లారు. నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలని కోరారు. జీడీనెల్లూరును ఇండస్ట్రీ హబ్‌గా మార్చడానికి అన్ని రకాల అవకాశాలున్నాయన్నారు. అధికారులు ముందుకు వస్తే తాను పెట్టుబడులు తీసుకొస్తానని, యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ఇండస్ట్రీలన్నీ శ్రీసిటీకే పోతున్నాయని, అక్కడ మనవారికి ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపించారు.

### ఇంటికొకరికి డయేరియా

బంగారుపాళ్యం దళితవాడలో 400 కుటుంబాలు ఉంటే కలుషితమైన నీరు తాగి ఇంటికొకరు డయేరియాకు గురయ్యారని ఎమ్మెల్యే మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ట్యాంకులు, పైపులు శుభ్రం చేయడం లేదని ఆరోపించారు.

### విలువైన పట్టాలన్నీ వైసీపీ వాళ్లకే: నాని

విలువైన పట్టాలన్నీ వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వారి సొంతవారికే కేటాయించారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆరోపించారు. చంద్రగిరి మండలం తొండవాడలో పేదల ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం ప్రభుత్వం భూసేకరణ చేసిందని, అందులో వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వారి బినామీల పేర్లపై పట్టాలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం అక్కడ భారీ ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. దీనిపై విచారించి రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నిజమైన అర్హులకు మాత్రం కొండల్లో గుట్టల్లో ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. ఐతేపల్లి- తిరుపతి మధ్య 108 వాహనం లేకపోవడం ఇబ్బందిగా మారిందని, దీంతో హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. చంద్రగిరిలో వాడకంలో లేని పీహెచ్‌సీని ప్రారంభించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వాస్పత్రికి కన్నా ప్రైవేటు ఆస్పత్రులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని కోరారు.

### ఒక్క డీఈవో కూడా రాలేదు: ఎమ్మెల్సీ

'ఉమ్మడి జిల్లాకు సంబంధించిన జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుంటే ఒక్క డీఈవో కూడా సమావేశానికి హాజరు కాకపోవడం దారుణం. వారికి ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అంటే లెక్క లేదు'అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయా జిల్లాల పరిధిలో విద్యాశాఖలో సమస్యలుంటే ఎవరికి చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అగౌరపరచడమేనన్నారు. రికార్డుల ప్రకారం చూస్తే నాడు- నేడు పనులు తొలివిడత ఇంకా పూర్తి కాలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న కట్టడాల వద్దకు వెళ్లి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నెల్లూరు జిల్లాలోని ఓ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గోడ కూలిపోయిన 8వ తరగతి విద్యార్థి మృతి చెందాడని, అనేక చోట్ల విద్యార్థులు గాయాలపాలవుతున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పోల్చుకుంటే అన్నమయ్య జిల్లా చదువులో వెనబడిందన్నారు. దీనికి పూర్తి బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారులదేనన్నారు. అన్నమయ్య జిల్లాలో డిజిటల్ విద్య ప్రారంభం కాలేదని, విద్యార్థులకు ఒక్క ట్యాబ్ ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు.

### చిత్తూరు డీఈవోపై ఫిర్యాదు

'చిత్తూరు డీఈవో దేవరాజు ఎమ్మెల్యేల మాటల్ని అస్సలు లెక్క చేయడం లేదు. ఏదైనా చెప్పినా పట్టించుకోవడం లేదు. దీన్ని మీరు సరిదిద్దండి' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ మూలాలున్న డీఈవో దేవరాజు మీద పులివర్తి నానితో పాటు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ కూడా గతంలో ఆగ్రహించారు. రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

### క్యాన్సర్ బాధితులందరికీ అందని చికిత్స: ఎంపీ

ఉమ్మడి జిల్లాలోని క్యాన్సర్ రోగులందరికీ చికిత్స అందించడం లేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. రోగుల సంఖ్య వేలల్లో ఉంటే చికిత్సకు నోచుకున్న వారు వందల్లోనే ఉన్నారన్నారు. దీనిపై దృష్టి సారించాలని తిరుపతి డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

### మదనపల్లె మార్కెట్‌లో నిలువుదోపిడీ

మదనపల్లె మార్కెట్‌లో టమోటా రైతులను వ్యాపారులు సిండికేట్‌గా మారి నిలువునా దోపిడీ చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 10 బాక్సుల టమోటాకు ఒక బాక్సు ఫ్రీగా ఇవ్వాలన్న జాక్‌పాట్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. 30 కిలోల బాక్సుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటి స్థానంలో 15 కిలోల బాక్సులు ప్రవేశపెట్టాలని అధికారులను కోరారు.

---

## ఎట్టకేలకు ఆన్‌లైన్‌లో జడ్పీ పీఎఫ్ స్లిప్పులు

- ఫలించిన చిత్తూరు కలెక్టర్ చొరవ

చిత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆందోళన కలిగిస్తున్న పీఎఫ్ ఖాతాల నిర్వహణలో మెరుగైన ముందడుగు పడింది. ఎట్టకేలకు పీఎఫ్ ఖాతాదారులు డిమాండు చేస్తున్నట్లుగా ఆన్‌లైన్‌లో పీఎఫ్ స్లిప్పులు విడుదలయ్యాయి. పీఎఫ్ ఖాతాల నిర్వహణలో అవకతవకల్ని ఎండగడుతూ ఎస్టీయూ మహాధర్నాకు సన్నద్ధం కావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని జడ్పీ చైర్మన్, సీఈవోల సమక్షంలో ఎస్టీయూ నాయకులతో చర్చించారు. సమస్య తీరుతెన్నులను లోతుగా పరిశీలించి పరిష్కరించమని సమగ్ర వివరాలతో రాష్ట్ర పంచాయతీ రాజ్ డైరెక్టర్ కృష్ణతేజకు లేఖ రాశారు. దీంతో ఆగస్టు 19 చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ నాయకుల ప్రతినిధి బృందంతో విజయవాడలో కృష్ణతేజ సమావేశమయ్యారు. సంబంధిత శాఖ సాంకేతిక విభాగం సిబ్బందిని పిలిపించి పీఎఫ్ చందాల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచాలని ఆదేశించారు. తమ వద్ద 2021 మార్చి వరకు మాత్రమే గణాంకాలు అందుబాటులో ఉన్నాయని, ఆ తర్వాతి వివరాలన్నీ జిల్లా పరిషత్‌ల నుంచి అందాల్సి ఉందని నివేదించారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వెంటనే అందరికీ బహిర్గతమయ్యేలా ఆన్‌లైన్‌లో ఉంచాలని, మిగిలిన వివరాలను నిర్దిష్ట సమయంలోగా అన్ని జిల్లాల నుంచి తెప్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం 2021 మార్చి వరకు అన్ని జిల్లాలకు సంబంధించిన పీఎఫ్ స్లిప్పులను ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. దీంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక తమ పీఎఫ్ ఖాతాల్లో ఎంత మొత్తం ఉందో తెలుసుకోలేని స్థితిలో ఉన్న టీచర్లకు ఈ చర్య మంచి ఉపశమనాన్ని కలిగించింది. ఇదివరకు పీఎఫ్ రుణాలు పొందాలన్నా, పదవీ విరమణ చెందినవారు తుది మొత్తాలు పొందాలన్నా ఈ పీఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేక తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఆ సమస్యకు పరిష్కారం లభించింది. మరికొన్ని రోజుల్లో ఇప్పటివరకూ ఉన్న పూర్తి వివరాలతో పీఎఫ్ స్లిప్పులు అప్‌డేట్ కానున్నాయి. ఈ పీఎఫ్ సమస్య పరిష్కారానికి చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ తీసుకున్న చొరవ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులకు ఉపశమనం కలిగించింది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్మాణాత్మక చర్యల పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## భార్యను కత్తితో పొడిచి చంపేశాడు

### తిరుపతి శివారు మంగళం క్వార్టర్స్‌లో దుర్ఘటన

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 6: భార్యను కత్తితో పొడిచి చంపేశాడో భర్త. తిరుపతి శివారు కరకంబాడి రోడ్డులోని మంగళం క్వార్టర్స్‌లో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళం క్వార్టర్స్ చివరి వీధిలో రమేష్, రూపావతి నివాసముంటున్నారు. వీరికి చంద్రప్రియ (12), కుందనప్రియ (11) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. కొంతకాలంగా భార్యతో ఏదో ఒక కారణం చూపి రమేష్ గొడవ పడేవాడు. దీన్ని తట్టుకోలేక ఆమె తరచూ తల్లిదండ్రుల వద్దకు వెళ్లేది. కొద్దిరోజుల తర్వాత అత్తింటికి వెళ్లి భార్యకు నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం కూడా పిల్లలతో కలసి తిరుపతి ఎస్టీవీ నగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు రూపావతి వెళ్లింది. వినాయక చవితి పండగకు ఇంటికి రావాలని పిలవడానికి తనతండ్రి మార్కొండ, సోదరుడు కిషోర్‌లతో కలసి అత్తింటికి వెళ్లాడు. వారికి నచ్చజెప్పి భార్య, పిల్లలను గురువారం మధ్యాహ్నం ఇంటికి తీసుకొచ్చాడు. రాత్రి పిల్లలు, దంపతులు వేర్వేరు గదుల్లో నిద్రించారు. ఉదయం ఐదు గంటలకు భార్యభర్తల మధ్య గొడవ మొదలైంది. కోపోద్రిక్తుడైన రమేష్ తన భార్యను కత్తితో పొడిచి చంపేశాడు. తల్లి అరుపులకు నిద్రలేచిన పిల్లలు కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారంతా వచ్చారు. రమేష్ అప్పటికే రక్తం కారుతున్న కత్తిని చేతిలో పట్టుకుని గది నుంచి వెలుపలకు వచ్చాడు. ఆ తర్వాత నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, తాను చేసిన నేరాన్ని తెలిపి.. లొంగిపోయాడు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలను సేకరించారు. పిల్లలు, మృతురాలి తల్లి బుజ్జెమ్మ వివరాల ఆధారంగా ఎస్ఐ సాయినాథ్ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. తమ తల్లి చనిపోయిందని చిన్నారులు విలపించడం చూసినవారందరినీ కలచి వేసింది. ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా విషాదఛాయలు అలుముకున్నాయి.

## మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో దోపిడి

### రిజిస్ట్రేషన్‌కు రూ.2500 వసూలు- ఆగ్రహించిన దంపతులు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సిబ్బంది నూతన దంపతుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. రిజిస్ట్రేషన్ ధర రూ.500గా ఉంటే కార్యాలయంలోని సిబ్బంది మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రూ.2వేల నుంచి రూ.2,500 వసూలు చేస్తున్నారంటూ శుక్రవారం పలువురు నూతన దంపతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలలోని పౌరోహిత సంఘంలో నిరంతరం సామూహిక వివాహాలు జరుగుతుంటాయి. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పౌరోహిత సంఘంలోనే ఏర్పాటు చేసింది. పెళ్లిళ్లు జరిగిన వెంటనే భక్తులు ఈకార్యాలయంలో సంబంధిత పత్రాలు అందజేసి రూ.500 కట్టి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ పత్రాన్ని పొందుతున్నారు. కొంతకాలంగా ఈ కార్యాలయంలోని సిబ్బంది భారీ స్థాయిలో భక్తుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం కొందరు భక్తులు కార్యాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు, ఫొటోలు అందజేసినప్పటికీ ఎలాంటి రసీదు లేకుండా అధిక మొత్తంలో వసూలు చేయడం అన్యాయమన్నారు. జరుగుతున్న తప్పును చెప్పుకుందామంటే సంబంధిత అధికారి కూడా అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా టీటీడీ ఉన్నతాధికారులు, ప్రభుత్వ అధికారులు జరుగుతున్న అక్రమంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, వివాదం జరుగుతోందనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా తిరుమలలో నిషేధమైన సిగరెట్ ప్యాకెట్లు లభించడం గమనార్హం. దీంతో నూతన దంపతుల నుంచి జరుగుతున్న దోపిడీపై, నిషేధిత వస్తువులు లభించడంపైనా విచారణ చేపట్టారు.

## 30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 9 : నాయుడుపేట -చిన్నమాల జాతీయ రహదారి సమీపంలో తరలిస్తున్న 30 టన్నుల రేషన్ బియ్యాన్ని అర్బన్ సీఐ బాబి స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం నుంచి చెన్నైకు లారీలో 30 టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు రాబడిన సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఈ రేషన్ బియ్యాన్ని ఓ బ్రాండ్ పేరుతో ముద్రించిన గోనుసంచుల్లో అనుమానం రాకుండా తరలిస్తుండటంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ రేషన్ బియ్యం సుమారు 6లక్షలు విలువ చేస్తుందని తెలిపారు. కేసు నమోదుచేసి లారీని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 6 : నాయుడుపేట-బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను లారీ డీకొన్న ఘటనలో మోటారు సైకిలిస్టు హర్ష (21) మృతిచెందాడు. బిరదవాడ గ్రామానికి చెందిన హర్ష పట్టణంలో పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. బిరదవాడ సమీపంలోకి రాగానే బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హర్ష అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కర్మాగారం ఎదుట మహిళా కార్మికుల నిరసన

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 6 : నాయుడుపేట-మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారం ఎదుట మహిళా కార్మికులు శుక్రవారం నిరసన తెలియజేశారు. కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులను ఉన్నపళంగా ఉద్యోగాలకు రాజీనామా చేయమని చెప్పడం సబబుకాదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళా కార్మికులు నిరసన తెలియజేశారు.

## వరద బాధితులకు వైద్యుల వితరణ

వెంకటగిరి, సెప్టెంబరు 6 : వరద బాధితుల సహాయార్థం స్థానిక వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు వైద్యులందరూ కలిసి లక్ష రూపాయల నగదును శుక్రవారం ఎమ్మెల్యే రామకృష్ణ సమక్షంలో వరద బాధితుల సహాయ నిధికి పంపించారు.. అదేవిదంగా విశ్రాంతి ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం రూ 25 వేలు, విశాంతి ఆర్టీసీ కండెక్టర్ చలపతి రూ.10 వేలు అందజేశారు. వైద్యులు శేషం నాయుడు, సంజీవరాయుడుచ కళాధర్, నవీన్,ఎంవి రమణయ్య, మధుసూదన్ రావు, విశ్రాంతి ఉపాధ్యాయుడు పునుగోటి సుబ్రమణ్యం నాయుడు వున్నారు.

## బంగారంపేటలో క్యాన్సర్ పరీక్షలు

పెళ్లకూరు, సెప్టెంబర్, 6 : తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో బంగారంపేటలో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం బంగారంపేటకు పింక్ బస్సులో చేరుకున్న స్విమ్స్ వైద్య బృందం గ్రామస్తులకు క్యాన్సర్ పరీక్షలు చేపట్టారు. స్విమ్స్ వైద్యులు హరిత మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ అయిన వారికి ఉచితంగా స్విమ్స్‌లో వైద్య సేవలు అందిస్తామన్నారు. సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు పేరం మధునాయుడు తదితరులు ఉన్నారు.

## గుంతలో పడిన ఆవు

### క్రేన్‌తో సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు



గూడూరు అర్బన్, సెప్టెంబరు6: స్థానిక కోర్టుసెంటర్ సమీపంలో శుక్రవారం రోడ్డుపక్కన తీసివున్న గుంతలో ప్రమాదవశాత్తు ఓ ఆవు పడింది. గ్యాస్ పైపులైన్ల కోసం తీసిన గుంతలో పడివున్న ఆవును గుర్తించిన స్థానికులు క్రేన్‌సాయంతో సురక్షితంగా బయటకు తీశారు.

## వినాయక చవితి సంబరాలకు కొనుగోళ్లు







గూడూరులో కిక్కిరిసిన దుకాణాలు, సూళ్లూరుపేటలో వాహనాల్లో తీసుకెళ్తున్న ప్రతిమలు, బాపూజీ వీధిలో మొక్కజొన్న రూపొంచిన వినాయకుడి ప్రతిమ

గూడూరు, సెప్టెంబరు 6: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని శుక్రవారం గూడూరు పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. శనివారం చవితి పండుగ సందర్భంగా శుక్రవారం నుంచే పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్, ఆసుపత్రిరోడ్డు, కుమ్మరివీధిసెంటర్, గాంధీబొమ్మ సెంటర్, కోర్టు సెంటర్ కూడళ్ల వద్ద వినాయక ప్రతిమలను, గొడుగులు, పూలు, మామిడాకులు, పండ్లు, చెరుకు గడలు తదితర పూజాసామగ్రిని విక్రయించేందుకు చిన్నపాటి దుకాణాలను ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాలలో మట్టి వినాయక ప్రతిమలను అమ్మకానికి ఉంచారు.

**నాయుడుపేట :** ప్రజలు వినాయక చవితి పండుగకు కొనుగోళ్లల్లో నిమగ్నమయ్యారు. గణనాథుని ప్రతిమల కొనుగోళ్లకు బారులుతీరారు. విధ రకాల జాపత్రిని, అరటి గెలలను, మామిడి ఆకులను అమ్మకాలు చేపట్టారు. పండ్లు, పూలధరలు, అమాంతంగా పెరిగాయి. పండ్లు, పూలు, వస్త్రాలు, పిండిమరల వద్ద భక్తులు బారులు తీరారు.

**వెంకటగిరి టౌన్ :** పట్టణంలోని బజారువీధి, కాశీపేట, ఎన్‌జేఆర్ సర్కిల్, క్రాస్ రోడ్డు, పాలకేంద్రం ప్రాంతాల్లో వినాయ క చవితికి కావాల్సిన పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి.

**సూళ్లూరుపేట :** పట్టణంలోని షార్ బస్టాండు, కచ్చేరివీధిలోని పీర్లచావడి, బాపూజీ వీధిలో భారీ వినాయక ప్రతిమలు పెట్టేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బాపూజీ వీధిలో మొక్కజొన్నతో వినాయకుడి ప్రతిమను ప్రత్యేకంగా రూపొందించి పెడుతున్నారు. పట్టణంతోపాటు గ్రామాల నుంచి వచ్చి ఉత్సవ నిర్వాహకులు గణనాథుని ప్రతిమలు కొనుగోలు చేసుకొని ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్తున్నారు.





నాయుడుపేటలో వినాయక చవితి పూజా సామగ్రి అమ్మకాలు, పండ్లు తదితర సామగ్రి

## శ్మశానానికి దారి చూపాలి

### మృతదేహంతో విందూరు గ్రామస్తుల ఆందోళన



మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

గూడూరు, సెప్టెంబరు 6: శ్మశానవాటికకు దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని విందూరు గ్రామంలో గ్రామస్తులు గ్రామసచివాలయం వద్ద మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ శ్మశానవాటికకు గతంలో దారి సౌకర్యం ఉండేదని, ఆ దారిని కొందరు ఆక్రమించుకోవడంతో మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకువెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని ఆరోపించారు. మరో దారి కూడా గుంతలమయంగా మారడంతో శ్మశానవాటికకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. గత రెండేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం ఈ గ్రామానికి చెందిన ఆదెమ్మ అనే వృద్ధురాలు మృతిచెందడంతో అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు శ్మశానవాటికకు దారి సౌకర్యం లేకపోవడంతో ఆందోళనకు దిగారు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో, సచివాలయ సిబ్బందితో చర్చించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

## వరద బాధితుల కోసం విరాళాలు



గూడూరు, సెప్టెంబరు 6: స్థానిక బాలాజీ నిమ్మమార్కెట్ కార్యాలయంలో శుక్రవారం నిమ్మమార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 2లక్షలు, చిల్లీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిల్లీస్ కార్యాలయం వద్ద రూ. 50వేలు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాత్రింబవళ్లు వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులకు సహాయక చర్యలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, పెంచలయ్య, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, వెంకటేశ్వర్లురాజు, బాలకృష్ణంరాజు, శ్రీధర్, వెంకటసుబ్బయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

**చిట్టమూరు :** విజయవాడలో వరద బాధితుల సహాయార్థం 1.50లక్షల చెక్‌ను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు చిట్టమూరు మం డల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు శుక్రవారం అందజేశారు. వరద బాధితులకు తమ వంతుగా ఆదుకోవాలని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు.

## ముందస్తు చవితి పూజలు



గూడూరు అర్బన్, సెప్టెంబరు6: నెల్లటూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు వినాయకచవితి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రామయ్య మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలన్నారు. కార్యక్రమంలో బాబు, శేషాద్రి, రమేష్, హిమబిందు, కేశవలక్ష్మి, మనోరమ, విజయ పాల్గొన్నారు. చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుక నిర్వహించారు. మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి ప్రతిమలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూజలు నిర్వహించారు. హెచ్ఎం సుధాకర్, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, చంద్రశేఖర్, వీవీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు వాగుకి నదికీ తేడా తెలియదు

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 6 : వాగుకి నదికి తేడా తెలియని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహరెడ్డి విజయవాడ వరదల గురించి విమర్శలు చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎద్దేవా చేశారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు వెంకటగిరికి చెందిన 50 మంది వరద సహాయక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు.

## ప్రభుత్వ భూములు రీ సర్వే చేయాలి : చింతా

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు6: ఏర్పేడు నుంచి వెంకటగిరి దాకా ప్రభుత్వం భూములు రీ సర్వే చేయాలని మాజీ ఎంపీ చింతామోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ లక్షల ఎకరాలు వైసీపీ ప్రభుత్వ హయాంలో కబ్జాలు చేశారని ఆరోపించారు. మన్నవరం బీహెచ్‌ఈఎల్ వెంటనే పునః ప్రారంభించాలని, దీంతో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. నడికుడి శ్రీకాళహస్తీ రైల్వే పనులు త్వరగతిన ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చనిపోతున్నా....ఇక సెలవు

### వాట్సాప్ గ్రూపులో బాధిత మహిళ సందేశం

సత్యవేడు, సెప్టెంబరు 5:సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక ఆరోపణలు చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన తెలుగు మహిళ నాయకురాలు శుక్రవారం రాత్రి ఓ వాట్సాప్ గ్రూపులో పెట్టిన మెసేజ్ కలకలం రేపింది.గురువారం పగలంతా ఎవరికీ అందుబాటులో లేని ఆమె రాత్రి తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు ఇచ్చింది. అనంతరం శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో వాట్సాప్‌లో స్పందించడం గమనార్హం. "అందరికీ నమస్కారం.ఈ రోజు నాకు జరిగిన ఈ అన్యాయం మీ చెల్లికో, అక్కకో జరిగి ఉంటే ఇలా మీరు కామెంట్ చేయరు. అందుకే నేను చనిపోతున్న. ఈ రోజు నాకు పార్టీ గాని, నాయకులు గాని ఎవరూ సహకరించలేదు. ముమ్మాటికీ నేను చెప్పింది నిజం. అందరికీ సెలవు" అంటూ ఆమె వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు.ఆదిమూలానికి మద్దతుగా కొందరు వివిధ సామాజిక మాధ్యమాల్లో సదరు మహిళను దూషిస్తూ పోస్టులు పెట్టారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈ విధంగా స్పందించినట్లు తెలుస్తోంది.

## భూబకాసురులపై చర్యలు తప్పవు: సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6: వైసీపీ భూబకాసురులపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి, ఆయన అనుచరులు యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పట్టణ శివారు రాజీవ్‌నగర్ కాలనీలో అక్రమాలపై సర్వే మరింత లోతుగా సాగుతోందని, నిందితులకు శిక్ష తప్పదన్నారు. క్షేత్రస్థాయి సర్వే ముగిసిన తరువాత రాజీవ్‌నగర్‌లో ఇళ్లస్థలాలు కోల్పోయిన లబ్ధిదారులు తమ పట్టాలతో ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇక ముక్కంటి ఆలయంలో పారదర్శక పాలన తీసుకువచ్చి ఆదాయాన్ని గణనీయంగా పెంచామని వెల్లడించారు. పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో వన్‌వే ఆంక్షలు అమలు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే నియోజకవర్గంలోని చెరువుల మరమ్మతులు, పూడికతీత పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

## చంద్రబాబు పనితీరు అభినందనీయం: చింతా



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల కోసం కష్టపడుతున్న తీరు అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ప్రశంసించారు. పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద విపత్తు ప్రజలకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు 75ఏళ్ల వయసులో కూడా వరదలో నిరంతరం పర్యటిస్తూ ప్రజలకు సేవ చేయడం హర్షణీయమన్నారు. తెలుగు రాష్ట్రాలు వర్షంతో అతలాకుతలమై లక్షలాది మంది ప్రజలు అల్లాడిపోతుంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సింగపూర్‌లో చక్కర్లు కొట్టడం బాధాకరమన్నారు. వరదసాయంగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి వెంటనే రూ.5వేల కోట్లు నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని మన్నవరం బెల్ పరిశ్రమ, నడికుడి రైల్వేప్రాజెక్టు, అంతర్జాతీయ విమానాశ్రయం, దుగ్గరాజుపట్టణం పోర్టును బీజేపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేంద్రనాయుడు, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయం ప్రకారమే జాతర నిర్వహణ

రేణిగుంట, సెప్టెంబరు 6: సంప్రదాయంగా కట్ట పుట్టాలమ్మ జాతర నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పాడి రాజేంద్ర, సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి కట్ట పుట్టాలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలోని ఆలయ కమిటీ సభ్యులు జాతర నిర్వహణ పట్ల దుష్ప్రచారం చేయడాన్ని ఖండించారు. గ్రామప్రజలతో చర్చించి అందరి సమ్మతితోనే జాతర నిర్వహిస్తామన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు చలం, శ్రీను, సుధాకర్, మోహన్, వెంకటేశ్వర్లు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిమూలంపై ఆరోపణలు అవాస్తవం

నారాయణవనం, సెప్టెంబర్ 6: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని మండల పరిధిలోని టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. దీని వెనుక మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఉన్నారని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి కుట్ర వెనుక నిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు.

## పుష్పపల్లకిలో అవనాక్షమ్మ దివ్య స్వరూపం

నారాయణవనం, సెప్టెంబరు 6: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న అవనాక్షమ్మ జాతరలో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారు పుష్పపల్లకిలో విహరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పుష్పపల్లకిలో గ్రామవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

**శ్రీకాళహస్తి**
**సత్యవేడు**

# పండుగ సందడి





విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు - పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6: శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం పండుగ సందడి నెలకొంది. గణాలకు అధిపతి అయిన గణపయ్య ఆవిర్భావం జరిగిన రోజును వినాయక చవితిగా భక్తులు కొలుచుకుంటారు. యేటా దక్షిణాయనం భాద్రపద మాసం శుక్లపక్ష చవితినాడు జరిగే వినాయక చవితి పర్వదినాన్ని అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. వినాయక చవితి నుంచే హిందువుల పండుగలు మొదలు కావడంతో విశేషంగా భావిస్తారు. ఇళ్లల్లో భక్తులు వినాయక ప్రతిమలను కొలువుదీర్చి బొజ్జ గణపయ్యకు 21రకాల పత్రులు, పుష్పాలు, పండ్లు, చెరకుగడలతో పాటు విశేషంగా కుడుములు, ఉండ్రాళ్లు వంటి పిండివంటలతో నైవేద్యాలు సమర్పిస్తారు. స్వామికి ప్రీతికరమైన గరిక, దర్భ నుంచి పెద్దఎత్తున పూజాసామగ్రిని భక్తులు ముందురోజే సిద్ధం చేసుకుంటారు. యేడాదిలో విశేషంగా దొరికే ఫలాలను స్వామికి అర్పించేందుకు ప్రత్యేకంగా ప్రజలు కొనుగోలు చేసేందుకు తహతహలాడుతారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పట్టణవ్యాప్తంగా వ్యాపారులు అన్ని రకాల పూజా సామగ్రితో అమ్మకాలు సాగించేందుకు సిద్ధమయ్యారు. పట్టణవాసులే కాకుండా శ్రీకాళహస్తి పరిసర మండలాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు పట్టణానికి విచ్చేశారు. పట్టణంలోని ప్రధాన మార్గాలన్నీ కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. పచ్చని అరటి పిలకలతో పాటు ఏపుగా పెరిగిన చెరకు గడలు, ఆకర్షణీయంగా వినాయక ప్రతిమకు అమర్చే గొడుగులు, వివిధ సైజుల్లో సిద్ధమైన మట్టిగణపయ్య ప్రతిమలు అరుదుగా లభించే కొబ్బరిపూత, ఔషధ పత్రులు, మొగలి తోరణాలు ఇలా ఎక్కడ చూసినా పండుగ సందడిని ప్రతిబింబించాయి.

**రేణిగుంట:** పట్టణంలో వినాయక చవితి సందడి నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచి బజారు, జీఎం వీధిలో జనసందోహంతో నిండిపోయింది. పండుగ పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు పట్టణానికి విచ్చేయడంతో బజారువీధి జనాలతో కళకళలాడింది.

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండల కేంద్రంలో రాజస్థాన్‌వాసులు తయారు చేసిన వినాయక ప్రతిమలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. మండలం నుంచే కాక వరదయ్యపాళెం, సూళ్ళూరుపేట మండలాల నుంచి ప్రజలు పెద్దఎత్తున వచ్చిన వినాయక బొమ్మలతో పాటు పూజ సామగ్రి కొనుగోలు చేశారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

సత్యవేడు, సెప్టెంబరు 6: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్డీఏ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 220మంది నిరుద్యోగ యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఇంటర్వ్యూలకు 180మంది హాజరయ్యారు. ఇందులో 65మంది వివిధ పరిశ్రమల్లో పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ గోపీకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్లీచింగ్ వితరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6: పట్టణంలోని కాసా గార్డెన్‌లో గల గురుకుల పాఠశాలకు దాతలు శుక్రవారం బ్లీచింగ్ వితరణ చేశారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ భార్గవమూర్తి, పాత్రికేయుడు సుబ్బారావు, రఘు గురుకుల్ రెండు బస్తాల బ్లీచింగ్ అందజేశారు. ప్రిన్సిపాల్ ప్రభావతి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## అమృత్ సరోవర్లతో భూగర్భ జలాల వృద్ధి



మొక్క నాటుతున్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్

ఏర్పేడు, సెప్టెంబరు 6: ఏర్పేడు మండలం కోబాక, బండారుపల్లి పంచాయతీల్లో చేపట్టిన అమృత్‌సరోవర్ పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశీష్‌గుప్తా, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, పుత్తూరు క్లస్టర్ అసిస్టెంట్ పీడీ సరిత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశీష్‌గుప్తా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అమృత సరోవర్ పనులు చేపట్టడం వల్ల గ్రామీణ కూలీలకు పనులు కల్పించడంతో పటు భూగర్భజలాలు వృద్ధి చెందుతాయన్నారు. అంతేకాకుండా అమృత్ సరోవర్‌లో చేపల పెంపకం వల్ల పంచాయతీలకు ఆర్థిక వనరులు చేకూరుతాయని తెలిపారు. కాగా, మండలంలో మరన్ని చోట్ల అమృత సరోవర్‌లు ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నారావు, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యయాదవ్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రారంభం

సత్యవేడు, సెప్టెంబరు 6: నియోజకవర్గంలో 2025 ఓటర్ల జాబితా సవరణ చేపట్టినట్లు ఈఆర్వో రామ్మోహన్ రావు తెలిపారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటర్ల జాబితా సవరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వరకు బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. 2025 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారి పేర్లను జాబితాలో నమోదు చేస్తారన్నారు. పరిశీలన పూర్తయిన తరువాత అక్టోబరు 10 నాటికి ఆన్‌లైన్ నమోదు పూర్తవుతుంద న్నారు. సమావేశంలో డీటీ రవిచంద్ర, సీనియర్ అసిస్టెంట్ సురేష్, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

## చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 6: వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని ఎస్ఐ విశ్వనాథ నాయుడు అన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల దగ్గర ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో రికార్డు డ్యాన్సులు, డీజే సౌండ్లు పెట్టకూడదని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

## యూనిఫాం పంపిణీ

ఏర్పేడు, సెప్టెంబరు 6: పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాజీ సర్పంచు తంబా సుబ్రహ్మణ్యం యూనిఫాం పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు



పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

## చవితి సందడి

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 6: పుత్తూరు పట్టణంలో శుక్రవారం చవితి సందడి నెలకొంది. వినాయకుడి పూజ నిర్వహణకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసేందుకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పట్టణానికి రావడంతో రద్దీ నెలకొంది. తిరుపతి రోడ్డులో ట్రాఫిక్ స్థంభించడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, సెప్టెంబర్ 6: నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చెప్పారు. శుక్రవారం వడమాలపేటలోని టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా కృషి చేయడం వల్ల మండలంలోని అత్యధిక మెజారిటీ వచ్చిందని ప్రశంసించారు. ప్రజలకు, అధికారులకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తూ గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మణిరాజు, ధనంజయులు నాయుడు, వెంకటయ్య, పెద్దబ్బరాజు, మునిరత్నం, హేమావతి, ఉమాపతిరావ్, వెంకటేశ్వరావ్, రవి నాయుడు, దేవ, భాస్కర్ నాయుడు, లోకరాజు, వేణు, శివశంకర్‌రాజు, మురళీ ఆచారి, శివ రాయల్, శేఖర్‌నాయుడు, వెంకయ్య, వినోద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## అమృత్ సరోవర్ పనుల పరిశీలన



కొబ్బరితోటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వడమాలపేట, సెప్టెంబర్ 6: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అమృత్ సరోవర్ పనులను గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్తా ఆధ్వరవ్యంలోని కేంద్ర బృందం శుక్రవారం పరిశీలించింది. వడమాలపేట గ్రామంలో సంజీవని ఫారంను పరిశీలించారు. రామసముద్రంలో పర్కులేషన్ పాండులు, సమతల కందకాలు, కదిరి మంగళంలో కొబ్బరి, జామ, మామిడి, గులాబీ తోటలు, ఎల్ఎం కండ్రిగ, అప్పలాయగుంట, కల్లూరులో అమృత సరోవర్ పథకం కింద చెరువుల అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే సీతారంపురం రోడ్డును తనిఖీ చేశారు. మండలంలో ఉపాధి పనుల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులందరూ ఒకే డోర్ నెంబర్‌లో ఉండాలి

వడమాలపేట, సెప్టెంబర్ 6: ఒక కుటంబ సభ్యులందరూ ఒకే డోర్ నెంబర్, ఒకే సెక్షన్ పరిధిలోనే ఉండాలని నగరి ఆర్డీవో వెంకటరెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని కదిరిమంగళం, తట్నేరి, ఎస్‌వీపురం గ్రామాల్లో బీఎల్‌వోల ఇంటింటి సర్వేను పరిశీలించారు. బీఎల్‌వోలు ప్రతి ఒంటిని సందర్శించి ఫారం 6, 6బీ, 7, 8 వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జరీనా, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## ఐటీడీపీ కోఆర్డినేటర్‌కు అభినందన

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 6: టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లి టాప్ స్కోరర్‌గా నిలిచిన పట్టణంలోని 20 వార్డు యూనిట్ ఐటీడీపీ కోఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్‌ను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అభినందించారు. ఈశ్వర్ యాదవ్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

## 10న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడీఆఫ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, పురపాలక సంఘ ఇన్‌ఛార్జి కమిషనర్ లలిత తెలిపారు. పలు బహుళ జాతీయ కంపెనీలు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన యువత అర్హులని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుంద న్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు సంబంధిత లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అలాగే ఆధార్‌కార్డు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్ జిరాక్సులు, బయోడేటా తమ వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 7989509540, 8919889609 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.








# వినాయక చవితి సందడి

మంగళం, సెప్టెంబరు6: తిరుపతిలో ఒకరోజు ముందుగా శుక్రవారమే వినాయక చవితి పండగ సందడి నెలకొంది. శనివారం ఉదయం నిర్ణీత సమయానికి బొజ్జ గణపయ్యకు పూజలు నిర్వహించడానికి ఇటు మండలపాలు,అటు ఇళ్లలో ఏర్పాట్లు చేసుకున్నారు. గాంధీరోడ్డు, నాలుగుకాళ్ల మండపం, మున్సిపల్ ఆఫీస్ సర్కిల్, తుడా రోడ్డు, లీలా మహల్ సర్కిల్, ఆర్సీ రోడ్డు, ఎంఆర్‌పల్లె పరిసర ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు.. పూజా సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన జనం కిక్కిరిశాయి. అర అడుగు నుంచి ఐదు అడుగుల వరకు ఉన్న వినాయక ప్రతిమలు ఆకట్టుకున్నాయి. కొన్నిచోట్ల ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురయ్యాయి. ఈదఫా పూల ధరలు మాత్రం భారీగా పెరిగాయి.


గణేష్ మహారాజులు


తరలిపోతున్న గణపయ్య


విగ్రహాలను కొనుగోలు చేస్తున్న జనం



తుది మెరుగులు

## బొమ్మలక్వార్టర్స్‌లో ఇలా..

**తిరుపతి అర్బన్:** మంగళం పరిధి బొమ్మల క్వార్టర్స్‌లో వినాయక ప్రతిమల విక్రయాలు జోరుగా సాగాయి. ఉదయం నుంచే కొనుగోలుదారులు భారీగా తరలివచ్చారు. రెండున్నర అడుగల నుంచి 17 అడుగుల ఎత్తు వరకు దాదాపు వంద గోడౌన్లలో వివిధ రూపాల వినాయకుడి ప్రతిమలు కనువిందు చేశాయి. నగరంతోపాటు నలువైపుల నుంచి వచ్చిన యువకులు, దాతలతో ఆ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది.

## తమలపాకులతో వినాయకుడు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 6: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన తమలపాకుల వినాయకుడి ప్రతిమ ఆకట్టుకుంటోంది. 10అడుగుల వెడల్పు..7అడుగుల ఎత్తుతో 10వేల తమలపాకులను వినియోగించి ఈ ప్రతిమని తీర్చిదిద్దారు. చుట్టూ కృత్రిమంగా అందమైన అడవిని ఏర్పాటు చేసి.. ఇరువైపులా నెమళ్ల ప్రతిమలను అమర్చారు. మర్రిచెట్టు ఊడలు, పచ్చటి తీగలతో అడవిలో వినాయకుడు కొలువుదీరినట్టుగా సినీరంగ కార్మికులు దీన్ని తీర్చిదిద్దారు. పర్యావరణానికి ఎటువంటి హానిలేని విధంగా టన్ను పుట్టమట్టి, టన్ను కాగితపు గుజ్జుతోపాటు సాధారణ రంగులతో ఈ ప్రతిమని రూపొందించారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11.30గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి.. భక్తులు దర్శించుకునే ఏర్పాట్లు చేస్తున్నారు.



## 3 నియోజకవర్గాలకు 760 విగ్రహాల వితరణ

తిరుపతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లోని పల్లెలకు బొమ్మల క్వార్టర్స్ వద్ద వినాయక పెద్ద విగ్రహాల వితరణను శుక్రవారం జాతీయ టూరిజం మాజీ బోర్డు డైరెక్టర్ సురేంద్రకుమార్ రెడ్డి ప్రారంభించారు. శ్రీకాళహస్తికి 460, తిరుపతికి 280, వెంకటగిరి నియోజకవర్గ పల్లెలకు 20 విగ్రహాల చొప్పున అందజేశామన్నారు.



## మట్టి విగ్రహాల పంపిణీ

తిరుపతి సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నూతన కార్యాలయంలో శుక్రవారం మట్టి విగ్రహాల పంపిణీ జరిగింది. ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు నరేంద్ర బాబు, అశోక్ కుమార్‌లు స్థానికులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. రంగుల విగ్రహాలతో కాలుష్యాన్ని వ్యాప్తి చేయకుండా మట్టి వినాయకులనే పూజించాలని ఈసందర్భంగా వారు పిలుపునిచ్చారు.



## వినాయక సాగర్‌లో పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 6: వినాయకచవితి వేడుకల్లో భాగంగా నిర్వహించే నిమజ్జనోత్సవానికి వినాయకసాగర్‌లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని నగర పాలకసంస్థ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం పోలీసు, ఫైర్, ఇతర విభాగాల అధికారులతో కలిసి సాగర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్ అమరయ్య, నిమజ్జనోత్సవ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. డీఎస్పీ రామకృష్ణ ఆచారి, సీఐ రామ్‌కిషోర్, డీఈ విజయకుమార్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్సీ మునికృష్ణ, గుండాల గోపి, ఆకుల సతీష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


వినాయకసాగర్ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, నిమజ్జన కమిటీ సభ్యులు

**మంగళం:** గంగమ్మ ఆలయం వద్ద ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. కేఎస్ రాజా, సుబ్రహ్మణ్యంరెడ్డి, కల్యాణి, ప్రవీణ్, సాయి, ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






**తిరుపతి(విద్య):** రీచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్వీవీ నగర్ వాసులకు 100 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల, ప్రతినిధి డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, బాలాజి పాల్గొన్నారు.

## విజిలెన్స్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6: తిరుపతి విజిలెన్స్ ఎస్పీగా కరీముల్లా షరీఫ్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడ నుంచి బదిలీపై తిరుపతికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అవినీతి పరులపై చర్యలకు సిఫార్సు చేస్తామని చెప్పారు.


కరీముల్లా షరీఫ్

## నేడే సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాల ప్రదానోత్సవం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 6: మహతి కళాక్షేత్రంలో శుక్రవారం భారత మాజీ రాష్ట్రపతి, దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి గురుపూజోత్సవం, జీవిత సాఫల్య బంగారు నంది, ఎక్సలెన్సీ, ఉత్తమ గురువు పురస్కారాలతో సత్కరించనున్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.20 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 61,142 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 21,525 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

## బీజేపీలో సభ్యత్వం తీసుకోండి: కిసాన్ మోర్చా

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 6: దేశాభివృద్ధి జరగాలంటే బీజేపీలో సభ్యత్వం తీసుకోవాలని, ప్రధాని మోదీకి అండగా నిలవాలని కిసాన్ మోర్చా నాయకులు ప్రసాద్ రాయల్, మోహన్‌బాబు, ప్రతాప్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. సెల్ నెంబర్ 88000 02024కు ఫోన్‌చేసి, తద్వారా దరఖాస్తును పూరించడం ద్వారా సభ్యత్వాన్ని పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎస్టీయూ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం


కోట పురుషోత్తానికి సన్మానం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 6: సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి చెప్పారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని ఎస్టీయూ భవనంలో గురుపూజోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కోట పురుషోత్తం మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు పలు అంశాలపై పుస్తకాలను చదువుతూ ఉపాధ్యాయులు నిరంతరం తమ పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పెంచుకుంటూ ఉండాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న పి.మురళీకృష్ణను, జి.దేవరాజులు నాయుడిని, 2010 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులై తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 50 మందిని సన్మానించారు. డీవైఈవో బాలాజి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పద్మిని, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ఆన్‌లైన్‌లో జడ్పీ పీఎఫ్ స్లిప్పులు

● ఫలించిన చిత్తూరు కలెక్టర్ చొరవ

చిత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆందోళన కలిగిస్తున్న పీఎఫ్ ఖాతాల నిర్వహణలో మెరుగైన ముందడుగు పడింది. ఎట్టకేలకు పీఎఫ్ ఖాతాదారులు డిమాండు చేస్తున్నట్లుగా ఆన్‌లైన్‌లో పీఎఫ్ స్లిప్పులు విడుదలయ్యాయి. పీఎఫ్ ఖాతాల నిర్వహణలో అవకతవకల్ని ఎండగడుతూ ఎస్టీయూ మహాధర్నాకు సన్నద్ధం కావడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని జడ్పీ చైర్మన్, సీఈవోల సమక్షంలో ఎస్టీయూ నాయకులతో చర్చించారు. సమస్య తీరుతెన్నులను లోతుగా పరిశీలించి పరిష్కరించమని సమగ్ర వివరాలతో రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజకు లేఖ రాశారు. దీంతో ఆగస్టు 19 చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ నాయకుల ప్రతినిధి బృందంతో విజయవాడలో కృష్ణతేజ సమావేశమ్యారు. సంబంధిత శాఖ సాంకేతిక విభాగం సిబ్బందిని పిలిపించి పీఎఫ్ చందాల వివరాలను పూర్తి స్థాయిలో సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచాలని ఆదేశించారు. తమ వద్ద 2021 మార్చి వరకు మాత్రమే గణాంకాలు అందుబాటులో ఉన్నాయని, ఆ తర్వాతి వివరాలన్నీ జిల్లా పరిషత్‌ల నుంచి అందాల్సి ఉందని నివేదించారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వెంటనే అందరికీ బహిర్గతమయ్యేలా ఆన్‌లైన్‌లో ఉంచాలని, మిగిలిన వివరాలను నిర్దిష్ట సమయంలోగా అన్ని జిల్లాల నుంచి తెప్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం 2021 మార్చి వరకు అన్ని జిల్లాలకు సంబంధించిన పీఎఫ్ స్లిప్పులను ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. దీంతో వైసీపీ అధికారంలోకి వచ్చాక తమ పీఎఫ్ ఖాతాల్లో ఎంత మొత్తం ఉందో తెలుసుకోలేని స్థితిలో ఉన్న టీచర్లకు ఈ చర్య మంచి ఉపశమనాన్ని కలిగించింది. ఇదివరకు పీఎఫ్ రుణాలు పొందాలన్నా, పదవీ విరమణ చెందినవారు తుది మొత్తాలు పొందాలన్నా ఈ పీఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేక తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఆ సమస్యకు పరిష్కారం లభించింది. మరికొన్ని రోజుల్లో ఇప్పటివరకూ ఉన్న పూర్తి వివరాలతో పీఎఫ్ స్లిప్పులు అప్‌డేట్ కానున్నాయి. ఈ పీఎఫ్ సమస్య పరిష్కారానికి చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ తీసుకున్న చొరవ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులకు ఉపశమనం కలిగించింది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్మాణాత్మక చర్యల పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## తిరుమలలో కార్మికుడిపై హత్యాయత్నం

### పోలీసుల అదుపులో పీలేరువాసి


గాయపడిన నరసింహ - దాడికి పాల్పడిన ఉదయ్‌కిరణ్

తిరుమల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ భవన నిర్మాణ కార్మికుడిపై పీలేరుకు చెందిన యువకుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన నరసింహ(34) కొన్నేళ్లుగా తిరుమలలో భవన కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పాంచజన్యం విశ్రాంతి భవనం వద్ద ఉన్న కారు పార్కింగ్‌లో టీమాస్టర్‌గా పనిచేస్తున్న పీలేరుకు చెందిన ఉదయ్‌కిరణ్(22)తో వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ వీరంగం సృష్టించారు. సహనం కోల్పోయిన ఉదయ్‌కిరణ్ తన జేబులో ఉన్న ప్లాస్టిక్ గ్రిప్ పేపర్ కట్టర్‌తో నరసింహపై దాడిచేశాడు. దీంతో నరసింహ మెడపై తీవ్ర గాయమైంది. అక్కడున్నవారు బాధితుడిని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి పంపారు. ఈ సమాచారంతో టూటౌన్ సీఐ మురళీమోహన్‌రావు సిబ్బందితో వెళ్లి ఉదయ్‌కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడ్డ నరసింహను మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. టీ విక్రయం విషయంలోనే ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైనట్టు పోలీసులు తెలిపారు. కాగా, ఉదయ్‌కిరణ్ మత్తులో ఉన్నట్టు తెలిసింది.

## అగ్నికి ఆహుతైన హోటల్ : రూ.5 లక్షల ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి తిరుపతి కేశవాయనగుంటలోని ఓ హోటల్ శుక్రవారం అగ్నికి ఆహుతైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. సాయినగర్‌లో నివాసముండే మల్లికార్జున.. కేశవాయనగుంటలో గ్రామీణ బిర్యానీ హోటల్ నిర్వహిస్తున్నాడు. హోటల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పైకప్పునకు మంటలు అంటుకున్నాయి. మరోవైపు మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చేలోపే హోటల్ పూర్తిగా దగ్ధమైంది. వంట సామగ్రి, గ్యాస్ సిలిండర్లు, బియ్యం, పప్పు దినుసులు, ప్లాస్టిక్ కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లు ఆహుతయ్యాయి. దాదాపు రూ.5 లక్షల ఆస్తినష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

## వరద బాధితులకు అభయహస్తం



తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల కోసం గోవిందసేవా మండలి అభయహస్తం ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సభ్యులు జగన్నాథం, చంద్రమోహన్, ప్రభాకర్, రామారావు, కృష్ణయ్య, సుధీర్, శేఖర్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. విజయవాడలోని వరద బాధితుల సేవా సహాయార్థం లీలామహల్ సమీపంలో కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. దాతలు వస్తురూపంలో సాయం అందించవచ్చన్నారు. వీటిని తమ సంస్థ ఆధ్వర్యంలో బాధితులకు అందజేస్తామని చెప్పారు. వివరాలకు 93936 27575 నెంబరును సంప్రదించాలన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో నేడు గణేష్ ఉత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు6 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శనివారం గణేష్ ఉత్సవం నిర్వహించనున్నారు. ఎస్వీయూనివర్సిటీలోని శ్రీవారి ఆలయ సమీపంలో గణేశుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర తెలిపారు.



**రామచంద్రాపురం:** మండలంలో వినాయక చవితి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గంగమాంబపురం, రామాపురం, ఆర్‌సీపురం, గంగిరెడ్డిపల్లె గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసి భారీ వినాయక ప్రతిమలను కొలువుదీర్చారు. చలువపందిళ్ల, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

గంగమాంబపురంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడు

## ఐదుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 143 దుంగలు, రెండు వాహనాల స్వాధీనం

మంగళం, సెప్టెంబరు 6: తడ వద్ద గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. కంటైనర్‌లో తరలిస్తున్న 143 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు వైపుగా వెళుతున్న కంటైనర్‌ను ఆపి తనిఖీలు చేయగా.. వెనుక భాగంలో ప్రైవేటు కంపెనీకి చెందిన బాక్సులను వేసుకుని ముందు భాగంలో 143 ఎర్రచందనం దుంగలు లోడ్ చేసి ఉండటాన్ని గుర్తించిన టాస్క్‌ఫోర్సు పోలీసులు కంటైనర్, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి.. ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు, వాహనాలను శుక్రవారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించారు. స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు దుంగలను పరిశీలించారు.


దుంగలను పరిశీలిస్తున్న సుబ్బరాయుడు

## తిరుమల మాడవీధుల్లో డీఎస్పీ తనిఖీలు

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మాడవీధుల్లో డీఎస్పీ విజయ్‌శేఖర్ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈక్రమంలో మాడవీధుల్లోని గ్యాలరీలను డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు, విజిలెన్స్ సీఐలు, వీఐలతో కలిసి పరిశీలించారు. గ్యాలరీల్లోకి ఎంతమందిని అనుమతించాలి, తొక్కిసలాటలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. సీఐలు విజయకుమార్, మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మాడవీధుల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

## సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళం



రూ.10 లక్షల నమూనా చెక్‌తో దివాకర రెడ్డి తదితరులు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి చంద్రగిరి టీడీపీ నాయకుడు డాలర్స్ దివాకర రెడ్డి రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సేవలను స్ఫూర్తిగా తీసుకుని డాలర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు.మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ వరదబాధితులకు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తలకోన ఏటి రోడ్డుకు మరమ్మతులు



తలకోన ఏటి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న తెలుగు తమ్ముళ్లు

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 6: మండలంలో ప్రధాన మార్గమైన బోడేవాండ్లపల్లె-కోటకాడపల్లె రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. ఐదేళ్లుగా మరమ్మతుల్లేక వచ్చే నీటి ప్రవాహానికి కోతకు గురై ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. వర్షం వస్తే ఏటిలో నీళ్లు ప్రవహిస్తే ప్రయాణించడం వీలు కాదు. ఎప్పుడో వేసిన సీసీ రోడ్డు పూర్తిగా నీటి కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నానికి స్థానికులు ఈ రోడ్డును బాగుచేసి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే.. రోడ్డు మరమ్మతులకు నివేదికలు అధికారులను పంపి.. అంచనాలు సిద్ధం చేశారు. ఈలోగా పంచాయతీకి చెందిన తెలుగు తమ్ముళ్లు నడుం బిగించారు. వర్షాలు వస్తే ప్రజలకు ఇబ్బందులు రాకుండా తమ సొంత నిధులతో రోడ్డు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ట్రాక్టరుతో ఇసుక, కంకర, సిమెంటు తరలించి తాత్కాలికంగా ప్రయాణించేందుకు అనువుగా తలకోన ఏటి రోడ్డును తీర్చిదిద్దారు.

## 10 నుంచి 'పొలం పిలుస్తోంది'

తిరుపతి(విద్య), సెప్టెంబరు 6: జిల్లాలో ఈనెల పదో తేదీ నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభమౌతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావుతో కలిసి శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమం మంగళ, బుధవారాలు మాత్రమే జరుగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల నిపుణులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేస్తారని వివరించారు.

## బీటెక్ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 6: పద్మావతి మహిళా యూనివర్సిటీ జూన్‌లో నిర్వహించిన బీటెక్ ఫస్టియర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈఈఈ, మెకానికల్, ఈసీఈ కోర్సులకు సంబంధించిన రెండో సెమిస్టర్ ఫలితాలను.. ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ



తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాల సమస్త సమాచారంతో ఆకట్టుకునే రంగులతో, చిత్రాలతో బుక్‌లెట్‌ను ముద్రించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ బుక్‌లెట్లను ఆవిష్కరించారు.

## వ్యవసాయాధారిత పనులకు ప్రాధాన్యమివ్వండి

రామచంద్రాపురం, సెప్టెంబరు 6: వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యమివ్వాలని భారత గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి డిప్యూటీ సెక్రటరీ ఆశీష్ గుప్తా అన్నారు. ఆర్సీపురం మండలంలోని గణేశ్వరపురంలో మల్బరీసాగును శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కింద సిరికల్చర్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన షెడ్‌ను తనిఖీ చేశారు. రైతు ఈశ్వరప్రసాద్‌కు అందిన సాయం, మల్బరీ సాగులో వస్తున్న ఆదాయ వివరాలను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో నాణ్యత పాటించి రైతులకు ఆదాయ వనరులు అందించే పనులతోపాటు పండ్ల మొక్కలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ శివప్రసాద్, పీడీ శ్రీనివాస ప్రసాద్, ఏపీడీలు పద్మలత, శ్రీనివాసులు, ఏపీవోలు హంసవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐకి సన్మానం

భాకరాపేట, సెప్టెంబరు 6: భాకరాపేట పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాఘవేంద్రను మండల టీడీపీ నాయకులు శుక్రవారం సత్కరించి మొక్కను అందజేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, వైస్ ఎంపీపీ దామోదరం, కృష్ణమూర్తి, మౌలాలి, చోటాసాహెబ్, రమేష్, తులసీరాయల్, యశ్వంత్ రాయల్, డిష్ మణి, చలపతి, మున్నా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న టీచింగ్ అసిస్టెంట్ మృతి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తూ మిద్దె పైనుంచి పడి చికిత్స పొందుతున్న కళావతి(28) శుక్రవారం మృతి చెందారు. మహిళా వర్సిటీలో టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈమె మిద్దెపైన దుస్తులు ఆరవేస్తూ ప్రమావశాత్తూ కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. దీంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆరోగ్యం విషమించడంతో శనివారం మృతి చెందింది. ఆమె తండ్రి చెంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఎస్కే మూర్తి తెలిపారు.

# స్మగ్లింగ్ కేసు పెడతామని డబ్బుల వసూలు

### ఎర్రావారిపాలెం స్టేషన్‌లో వసూల్‌నాయక్‌లు

తిరుపతి, సెప్టెంబరు 6 : శ్రీగంధం కేసులో నిందితుల కుటుంబీకుల నుంచి ఇద్దరు కానిస్టేబుళ్లు బెదిరించి డబ్బులు వసూలు చేయడం ఎర్రావారిపాలెం మండలంలో చర్చనీయాంశమైంది. గత నెల 20తేదిన ఎర్రావారిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆటోలో శ్రీగంధం తరలిస్తుండగా 8మంది నిందితులతో పాటు శ్రీగంధం తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేశారు.నిందితులంతా ఎర్రావారిపాలెం ఇర్లపాలేనికి చెందినవారే.వీరిలో గుండ్రాతి కుప్పం చంద్రయ్య ఒకరు. ఆయన కుమారుడు సుబ్రమణ్యం బతుకుతెరువు కోసం కువైట్ వెళ్ళి ఇటీవలే వచ్చాడు. కువైట్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీర్చి మళ్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో అతడి తండ్రి చంద్రయ్య శ్రీగంధం కేసులో పట్టుబడ్డాడు. ఇదే అదునుగా భావించిన ఇద్దరు కానిస్టేబుళ్లు ఇర్లపాలెం వెళ్లి నిందితుడు చంద్రయ్య భార్య లక్ష్మిని, కుమారుడు సుబ్రమణ్యాన్ని డబ్బులిమ్మని బెదిరించారు. లేదంటే సుబ్రమణ్యాన్ని శ్రీగంధం కేసులో ఇరికించి కువైట్ పోనీయకుండా చూస్తామని బెదిరించారు. దీంతో ఇల్లు కట్టుకునేందుకు కష్టపడి దాచుకున్న రూ.29వేలను వారికి సమర్పించుకున్నారు. సుబ్రమణ్యం గురువారం కువైట్ వెళ్లిపోవడంతో ఈ విషయం బయటకు వచ్చింది. ఆ ఇద్దరు పోలీసులు మరో ఆటో డ్రైవర్‌ను కూడా శ్రీగంధం తరలింపు కేసు పెట్టిస్తామని బెదిరించి రూ.10 వేలు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.పోలీసు ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సివుంది.

# ఆవేశంలో ఆలిని పొడిచి చంపేశాడు



పిల్లలతో రూపావతి (ఫైల్‌ఫొటో)





నిందితుడు రమేష్ - రూపావతి తల్లిని విచారిస్తున్న పోలీసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 6: భార్యను కత్తితో పొడిచి చంపేశాడో భర్త. తిరుపతి శివారు కరకంబాడి రోడ్డులోని మంగళం క్వార్టర్స్‌లో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళం క్వార్టర్స్ చివరి వీధిలో రమేష్, రూపావతి నివాసముంటున్నారు. వీరికి చంద్రప్రియ (12), కుందన ప్రియ (11) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. కొంతకాలంగా భార్యతో ఏదో ఒక కారణం చూపి రమేష్ గొడవ పడేవాడు. దీన్ని తట్టుకోలేక ఆమె తరచూ తల్లిదండ్రుల వద్దకు వెళ్లేది. కొద్దిరోజుల తర్వాత అత్తింటికి వెళ్లి భార్యకు నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం కూడా పిల్లలతో కలసి తిరుపతి ఎస్వీ నగర్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు రూపావతి వెళ్లింది. వినాయక చవితి పండగకు ఇంటికి రావాలని పిలవడానికి తనతండ్రి మార్కొండ, సోదరుడు కిషోర్‌లతో కలసి అత్తింటికి వెళ్లాడు. వారికి నచ్చజెప్పి భార్య, పిల్లలను గురువారం మధ్యాహ్నం ఇంటికి తీసుకొచ్చాడు. రాత్రి పిల్లలు, దంపతులు వేర్వేరు గదుల్లో నిద్రించారు. ఉదయం ఐదు గంటలకు భార్యభర్తల మధ్య గొడవ మొదలైంది. కోపోద్రిక్తుడైన రమేష్ తన భార్యను కత్తితో పొడిచి చంపేశాడు. తల్లి అరుపులకు నిద్రలేచిన పిల్లలు కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారంతా వచ్చారు. రమేష్ అప్పటికే రక్తం కారుతున్న కత్తిని చేతిలో పట్టుకుని గది నుంచి వెలుపలకు వచ్చాడు. ఆ తర్వాత నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, తాను చేసిన నేరాన్ని తెలిపి.. లొంగిపోయాడు. లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలను సేకరించారు. పిల్లలు, మృతురాలి తల్లి బుజ్జెమ్మ వివరాల ఆధారంగా ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. తమ తల్లి చనిపోయిందని చిన్నారులు విలపించడం చూసి నవారందరినీ కలచి వేసింది. ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతమంతా విషాదచాయలు అలుముకున్నాయి.



రక్తపుమడుగులో రూపావతి మృతదేహం

# మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో దోపిడి

### రిజిస్ట్రేషన్‌కు రూ.2500 వసూలు - ఆగ్రహించిన నూతన దంపతులు






సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నమోదు ప్రక్రియ ఆగిపోవడంతో నిరీక్షిస్తున్న నూతన దంపతులు - సిగరెట్ ప్యాకెట్లతో పట్టుబడిన ఉద్యోగి

తిరుమల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో సిబ్బంది నూతన దంపతుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. రిజిస్ట్రేషన్ ధర రూ.500గా ఉంటే కార్యాలయంలోని సిబ్బంది మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రూ.2వేల నుంచి రూ.2,500 వసూలు చేస్తున్నారంటూ శుక్రవారం పలువురు నూతన దంపతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలోని పురోహిత సంఘంలో నిరంతరం సామూహిక వివాహాలు జరుగుతుంటాయి. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం మ్యారేజ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పురోహిత సంఘంలోనే ఏర్పాటు చేసింది. పెళ్లిళ్లు జరిగిన వెంటనే భక్తులు ఈకార్యాలయంలో సంబంధిత పత్రాలు అందజేసి రూ.500 కట్టి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ పత్రాన్ని పొందుతున్నారు. కొంతకాలంగా ఈ కార్యాలయంలోని సిబ్బంది భారీ స్థాయిలో భక్తుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో శుక్రవారం సాయంత్రం కొందరు భక్తులు కార్యాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు, ఫొటోలు అందజేసినప్పటికీ ఎలాంటి రసీదు లేకుండా అధిక మొత్తంలో వసూలు చేయడం అన్యాయమన్నారు. జరుగుతున్న తప్పును చెప్పుకుందామంటే సంబంధిత అధికారి కూడా అందుబాటులో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా టీటీడీ ఉన్నతాధికారులు, ప్రభుత్వ అధికారులు జరుగుతున్న అక్రమంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, వివాదం జరుగుతోందనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా తిరుమలలో నిషేధమైన సిగరెట్ ప్యాకెట్లు లభించడం గమనార్హం. దీంతో నూతన దంపతుల నుంచి జరుగుతున్న దోపిడీపై, నిషేధిత వస్తువులు లభించడంపైనా విచారణ చేపట్టారు.

# స్నేహితుడి హత్య కేసులో మదనపల్లె యువకుడి అరెస్ట్

పాకాల, సెప్టెంబరు 6: దామలచెరువు పంచాయతీ రాజీవ్‌కాలనీ సమీపంలో ఈ ఏడాది జూన్ 11వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితుడిని పాకాల పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మద్దయ్యాచారి కథనం మేరకు.. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చంద్రశేఖర్, మదనపల్లెకు చెందిన సూర్యప్రకాష్ స్నేహితులు. సూర్యప్రకాష్ జులాయిగా తిరుగుతూ, మోటారు సైకిళ్లను దొంగిలిస్తూ, మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో జూన్ 11వ తేదీన రాజీవ్‌కాలనీ సమీపంలో చెరువు వద్ద బావిలో ఇద్దరూ స్నానం చేశారు. రూ.3వేల అప్పు విషయమై వివాదం తలెత్తింది. ఇద్దరూ కొట్టుకున్నారు.ఈ క్రమంలో బండరాయితో సూర్యప్రకాష్ దాడి చేయగా చంద్రశేఖర్ మృతి చెందాడు.అప్పటినుంచీ పరారీలో వున్న సూర్యప్రకాష్‌ను ఉప్పరపల్లె సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద పాకాల పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

## ఇక సెలవు | ఆదిమూలంపై ఆరోపణలు చేసిన తెలుగు మహిళ వాట్సాప్ సందేశం

సత్యవేడు, సెప్టెంబరు 6: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక ఆరోపణలు చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన తెలుగు మహిళ నాయకురాలు శుక్రవారం రాత్రి ఓ వాట్సాప్ గ్రూపులో పెట్టిన మెసేజ్ కలకలం రేపింది.గురువారం పగలంతా ఎవరికీ అందుబాటులో లేని ఆమె రాత్రి తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు ఇచ్చింది. అనంతరం శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో వాట్సాప్‌లో స్పందించడం గమనార్హం. "అందరికీ నమస్కారం. ఈ రోజు నాకు జరిగిన ఈ అన్యాయం మీ చెల్లికో, అక్కకో జరిగి ఉంటే ఇలా మీరు కామెంట్ చేయరు. అందుకే నేను చనిపోతున్న. ఈ రోజు నాకు పార్టీ గాని, నాయకులు గాని ఎవరూ సహకరించలేదు. ముమ్మాటికీ నేను చెప్పింది నిజం. అందరికీ సెలవు" అంటూ ఆమె వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. ఆదిమూలానికి మద్దతుగా కొందరు వివిధ సామాజిక మాధ్యమాల్లో సదరు మహిళను దూషిస్తూ పోస్టులు పెట్టారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈ విధంగా స్పందించినట్లు తెలుస్తోంది.

## సెకండ్‌హ్యాండ్ జీపు కొనుగోలులో మోసం


### సైబర్ క్రైం పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

చంద్రగిరి, సెప్టెంబరు 6: సెకండ్ హ్యాండ్ జీపు కొనుగోలు విషయంలో ఓ వ్యక్తి మోసపోయి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓఎల్‌ఎక్స్ యాప్‌లో సెకండ్ హ్యాండ్ జీపును రూ.90 వేలకే విక్రయిస్తున్నట్లు సోషల్ మీడియాలో ఓ పోస్టును చంద్రగిరి పంచాయతీ బీడీ కాలనీకి చెందిన షేక్ రఫీ చూశాడు. దీంతో ఆ జీపు కొనుగోలు కోసం అందులో ఉన్న సెల్‌ఫోన్ నెంబరుకు ఫోన్ చేశాడు. నరసాపురంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మెడికల్ షాపు వద్ద జీపు ఉందని హరి అనే వ్యక్తి గురువారం తెలిపాడు. ఇందుకోసం అదేరోజున రూ.74,500 అతనికి ఫోన్ పే చేశాడు. దీంతో జీపును నరసాపురం నుంచి చంద్రగిరికి తీసుకొస్తానని చెప్పాడు. శుక్రవారం వేకువజామున రఫీకి హరి ఫోన్ చేసి, నెల్లూరు వరకు వచ్చామని, డీజిల్ అయిపోయిందని, మరో రూ.3500 ఫోన్ పే చేయాలని కోరాడు. దీంతో రఫీ ఆ నగదును కూడా ఫోన్ పే చేశాడు. తర్వాత హరికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తూర్పుపల్లెలో చోరీకి విఫలయత్నం

చంద్రగిరి, సెప్టెంబరు 6: పనపాకం పంచాయతీ తూర్పుపల్లెలోని దామోదరం ఇంట్లో చోరీకి విఫలయత్నం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గురువారం తనింట్లో భార్య దేవీకుమారి, వదిన నందకుమారి నిద్రిస్తుండగా అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. కొంతసేపటికి గమనించిన నందకుమారి కేకలు వేయడంతో వారు పరారయ్యారు. అప్పటికే ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. మట్టి గాజుల బాక్స్ కనిపించలేదు. అయితే ఆ బాక్సును కూడా ఇంటి ముందు ప్రహరీపై పడేసి వెళ్లిపోయారు. దొంగల కోసం గ్రామస్తులు చుట్టుపక్కల గాలించారు. జరిగిన ఘటనపై శుక్రవారం ఉదయం పోలీసులకు దామోదరం ఫిర్యాదు చేశాడు.

## తిరుచ్చిపై పద్మావతి అమ్మవారి విహారం



తిరుచానూరు, సెప్టెంబరు 6: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోండి



అధికారులకు సమస్యలు తెలియజేస్తున్న వినియోగదారులు

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 6: సదరన్ డిస్కం పరిధిలో నిర్వహించే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళం రూరల్ ఏఈ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. వినియోగదారులు తమ సమస్యలను విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తికి వివరించారు. డీఈ ఈఈలు ఆంజనేయులు, ముని ప్రసాద్, బాలాజి, ఏఏవో టి.జయరాం, ఏఈలు హరిప్రసాద్, నాగరాజు, మోహన్, మునిరాం, హేమచంద్రా రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

# సమస్యలకు పరిష్కారమేదీ?

### అధికారుల తీరుపై జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యేల ఆగ్రహం





జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసులు, హాజరైన సభ్యులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 6: 'ఎప్పుడు మీటింగ్ పెట్టినా అధికారులు వస్తున్నారు. మేం చెప్పే సమస్యల్ని నోట్ చేసుకుంటున్నారు. పరిష్కారం మాత్రం చేయడం లేదు. రెండు నెలల కిందట జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేం ప్రస్తావించిన ఏ సమస్య కూడా పరిష్కారం కాలేదు' అంటూ ఆయా శాఖల జిల్లా అధికారులను ఎమ్మెల్యేలు నిలదీశారు. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష ప్రజాప్రతినిధులూ హాజరయ్యారు. సమస్యలపై అధికారులను నిలదీశారు. జడ్పీ సమావేశాల్లో ఆయా అంశాలు, శాఖల గురించి ఎంత చర్చించినా ఫలితం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం పది అంశాలపై చర్చ జరగాల్సి ఉండగా.. ఒక్కో అంశం గురించే సుదీర్ఘ చర్చ జరగడంతో ఐదింటితో సమావేశాన్ని ముగించారు. దాదాపు ప్రతి ఒక్కరూ ఆయా సమస్యల గురించి సమావేశంలో చర్చించారు. కొందరు జడ్పీటీసీలు కూడా మాట్లాడారు. వీరు చెప్పిన సమస్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్ నోట్ చేసుకుంటూ పరిష్కార మార్గాలు చెప్పారు. ఈ సమావేశానికి తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు భరత్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రగిరి, జీడీనెల్లూరు, తిరుపతి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, థామస్, ఆరణి శ్రీనివాసులు, మురళీమోహన్, జడ్పీటీసీలు, జేసీ విద్యాధరి, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తిరుపతి డీఆర్వో పెంచల కిశోర్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, సీఈవో గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

### 'ఇసుక' దుమారం

కర్ణాటక సరిహద్దులోని రామసముద్రం మండలంలో ఇసుక రీచ్ లేదని, ప్రజలు ఇళ్లు ఎలా నిర్మించుకోవాలని జడ్పీటీసీ రామచంద్రారెడ్డి నిలదీశారు. పక్క మండలాల నుంచి తెచ్చుకుంటుంటే పోలీసులు పట్టుకొని కేసులు పెడుతున్నారన్నారు. ఉచిత ఇసుక విధానమంటే ఇదేనా అని ప్రశ్నించారు. దీనిపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ కలగజేసుకొని ఇసుక కొరత ఉందని చెప్పండి కానీ.. ఉచిత ఇసుక విధానాన్ని మాత్రం ప్రశ్నించవద్దని సూచించారు. నదుల్లో ఇసుక లేకుండా వైసీపీ నాయకులు లూటీ చేస్తే ఎక్కడి నుంచి ఉంటుందని ఆయన ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ కలగజేసుకొని.. నదులు, వంకల్లో ఇసుక లేదని, మరోసారి వరదలు వస్తే తప్ప లభ్యం కాదన్నారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నారని జడ్పీటీసీ అడిగిన ప్రశ్నకు 'ఫలానా చోట ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని తనకే పదుల సంఖ్యలో ఫోన్లు వస్తున్నాయని కలెక్టర్ సమాధానం చెప్పారు. ఎక్కడైనా మనుషులు ద్వారా మాత్రమే ఇసుక తవ్వుకోవచ్చని చెప్పారు.

### ప్రాణాలు పోతున్నాయ్: థామస్

'గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎలాంటి హెల్త్‌కేర్ సౌకర్యం లేదు. చిన్న రోడ్డు ప్రమాదం జరిగినా చిత్తూరు, చీలాపల్లి సీఎంసీకి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈలోపు ప్రాణాలు పోతున్నాయి. ఇక, జనరల్ ఫిజీషియన్, జనరల్ మెడిసిన్ చేసిన వైద్యులు అందించాల్సిన వైద్యాన్ని పెనుమూరు సీహెచ్‌సీలో కళ్లు, పళ్ల డాక్టర్లు చేస్తుండడం దారుణం. పాలసముద్రం, వెదురుకుప్పం మండలాల్లో పాము కరిస్తే వైద్యం కోసం కొన్ని కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది' అంటూ వైద్య సమస్యను కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే థామస్ తీసుకెళ్లారు. నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలని కోరారు. జీడీనెల్లూరును ఇండస్ట్రీ హబ్‌గా మార్చడానికి అన్ని రకాల అవకాశాలున్నాయన్నారు. అధికారులు ముందుకు వస్తే తాను పెట్టుబడులు తీసుకొస్తానని, యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. ఇండస్ట్రీలన్నీ శ్రీసిటీకే పోతున్నాయని, అక్కడ మనవారికి ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపించారు.

### ఇంటికొకరికి డయేరియా

బంగారుపాళ్యం దళితవాడలో 400 కుటుంబాలు ఉంటే కలుషితమైన నీరు తాగి ఇంటికొకరు డయేరియాకు గురయ్యారని ఎమ్మెల్యే మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. ట్యాంకులు, పైపులు శుభ్రం చేయడం లేదని ఆరోపించారు.

### విలువైన పట్టాలన్నీ వైసీపీ వాళ్లకే: నాని

విలువైన పట్టాలన్నీ వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వారి సొంతవారికే కేటాయించారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆరోపించారు. చంద్రగిరి మండలం తొండవాడలో పేదల ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం ప్రభుత్వం భూసేకరణ చేసిందని, అందులో వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వారి బినామీల పేర్లపై పట్టాలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం అక్కడ భారీ ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. దీనిపై విచారించి రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు. నిజమైన అర్హులకు మాత్రం కొండల్లో గుట్టల్లో ఇంటి పట్టాలు ఇచ్చారన్నారు. ఐతేపల్లి- తిరుపతి మధ్య 108 వాహనం లేకపోవడం ఇబ్బందిగా మారిందని, దీంతో హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. చంద్రగిరిలో వాడకంలో లేని పీహెచ్‌సీని ప్రారంభించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వాస్పత్రికి కన్నా ప్రైవేటు ఆస్పత్రులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని కోరారు.

### ఒక్క డీఈవో కూడా రాలేదు: ఎమ్మెల్సీ

'ఉమ్మడి జిల్లాకు సంబంధించిన జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుంటే ఒక్క డీఈవో కూడా సమావేశానికి హాజరు కాకపోవడం దారుణం. వారికి ప్రజాప్రతినిధులు, కలెక్టర్ అంటే లెక్కే లేదు'అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయా జిల్లాల పరిధిలో విద్యాశాఖలో సమస్యలుంటే ఎవరికి చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అగౌరపరచడమేనన్నారు. రికార్డుల ప్రకారం చూస్తే నాడు- నేడు పనులు తొలివిడత ఇంకా పూర్తి కాలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న కట్టడాల వద్దకు వెళ్లి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నెల్లూరు జిల్లాలోని ఓ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గోడ కూలిపోయిన 8వ తరగతి విద్యార్థి మృతి చెందాడని, అనేక చోట్ల విద్యార్థులు గాయాలపాలవుతున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలతో పోల్చుకుంటే అన్నమయ్య జిల్లా చదువులో వెనబడిందన్నారు. దీనికి పూర్తి బాధ్యత జిల్లా విద్యా శాఖ అధికారులదేనన్నారు. అన్నమయ్య జిల్లాలో డిజిటల్ విద్య ప్రారంభం కాలేదని, విద్యార్థులకు ఒక్క ట్యాబ్ ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు.

### చిత్తూరు డీఈవోపై ఫిర్యాదు

'చిత్తూరు డీఈవో దేవరాజు ఎమ్మెల్యేల మాటల్ని అస్సలు లెక్క చేయడం లేదు. ఏదైనా చెప్పినా పట్టించుకోవడం లేదు. దీన్ని మీరు సరిదిద్దండి' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ మూలాలున్న డీఈవో దేవరాజు మీద పులివర్తి నానితో పాటు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ కూడా గతంలో ఆగ్రహించారు. రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

### క్యాన్సర్ బాధితులందరికీ అందని చికిత్స: ఎంపీ

ఉమ్మడి జిల్లాలోని క్యాన్సర్ రోగులందరికీ చికిత్స అందించడం లేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. రోగుల సంఖ్య వేలల్లో ఉంటే చికిత్సకు నోచుకున్న వారు వందల్లోనే ఉన్నారన్నారు. దీనిపై దృష్టి సారించాలని తిరుపతి డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

### మదనపల్లె మార్కెట్‌లో నిలువుదోపిడీ

మదనపల్లె మార్కెట్‌లో టమోటా రైతులను వ్యాపారులు సిండికేట్‌గా మారి నిలువునా దోపిడీ చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 10 బాక్సుల టమోటాకు ఒక బాక్సు ఫ్రీగా ఇవ్వాలన్న జాక్‌పాట్ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. 30 కిలోల బాక్సుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటి స్థానంలో 15 కిలోల బాక్సులు ప్రవేశపెట్టాలని అధికారులను కోరారు.